

## ఒకే గ్రామం.. రెండు నియోజకవర్గాల్లో ఓటు..

**ఆమదాలవలస:** సార్వత్రిక ఎన్నికల్లో ఒకే గ్రామానికి చెందిన ఓటర్లు.. రెండు నియోజకవర్గాల అసెంబ్లీ అభ్యర్థులకు ఓటేసిన పరిస్థితి ఏర్పడింది. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని మూడోవార్డు వాసులు.. మున్సిపల్ ఎన్నికల సమయంలో గ్రామమంతా ఒకే కౌన్సిలర్‌ను ఎన్నుకుంటారు. అయితే సార్వత్రిక ఎన్నికలు వచ్చేసరికి ఒకే గ్రామంగా ఉన్న ఊసవానిపేటలో శ్రీకాకుళం, ఆమదాలవలస నియోజకవర్గాల ఓటర్లుగా విడిపోవడం జరుగుతోంది. గ్రామంలోని సగభాగం శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గంలో ఉండగా, మిగిలిన సగభాగం ఆమదాలవల అసెంబ్లీ ఓటర్లుగా ఉన్నారు. ఎన్నికలు ఇదే రీతిన జరుగుతున్నాయి. ఈ నెల 13న నిర్వహించిన పోలింగ్‌లో.. ఆమదాలవలస నియోజకవర్గంలోని 48వ పోలింగ్ కేంద్రంగా ఉన్న కసింవలస, ఊసవానిపేట గ్రామాలకు చెందిన 814 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. మిగిలిన ఓటర్లు శ్రీకాకుళం నియోజకవర్గ పోలింగ్ కేంద్రంలో ఓటేశారు.





# వైసీపీకి వ్యతిరేకం..
# కూటమికే అనుకూలం

- రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో స్పష్టమైన వ్యతిరేకత
- పోలింగ్‌లో పోస్టల్ బ్యాలెట్ నుంచి... నిరుద్యోగ యువత ఓట్ల వరకూ ఏకపక్షంగానే..
- విశ్లేషణలన్నీ టీడీపీ-జనసేన-బీజేపీ మెజార్టీ పైనే..
- విజయంపై కూటమి నేతల ధీమా

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వైసీపీ ప్రభుత్వ తీరుపై ప్రజల్లో వ్యతిరేకత స్పష్టమైంది. ఐదేళ్లలో జగన్ పాలనపై అన్ని వర్గాల ప్రజల్లోనూ అసంతృప్తి కనిపించింది. హామీల అమలు కోసం, సమస్యలపై పోరాడితే.. కేసులు, దౌర్జన్యాలు, అరెస్టులు, భౌతిక దాడులతో జిల్లావాసులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు అభివృద్ధి పనులు చేపట్టక.. ఉపాధి అవకాశాలు లేక అవస్థలు పడ్డారు. ఇంకో వైపు భూ దందాలు, కబ్జాలు, ఇసుక అక్రమాలతో విసిగిపోయారు. అందుకే ఓటు ద్వారా జగన్ సర్కార్‌కు బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో పోలింగ్ నాడు వైసీపీకి వ్యతిరేకంగా.. కూటమికి అనుకూలంగా ఓటేశారని.. విశ్లేషణలు చెబుతున్నాయి. పోస్టల్ బ్యాలెట్ తోపాటు నిరుద్యోగ యువత, అర్బన్ ఓట్లన్నీ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికే పడ్డాయని వివిధ సర్వేల ద్వారా తెలుస్తోంది. దీంతో విజయావకాశాలపై కూటమి నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

● వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికలకు ముందు పాదయాత్ర సమయంలో జిల్లాలో హామీలు కురిపించారు. ఒక్కచాన్స్ ఇస్తే.. అభివృద్ధి చేసి చూపిస్తామని నమ్మించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలేవీ సక్రమంగా నెరవేర్చలేదు. కొత్తగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదు. పాతవాటిని కొనసాగించలేదు. గతంలో నిరుపేదలకు రూ.5 కే భోజనం అందించే అన్నక్యాంటీన్లను ఎత్తేశారు. టీడీపీ హయాంలో రూపకల్పన చేసిన ప్రాజెక్టులను పక్కన పెట్టేశారు. ఉద్దానం ప్రజలకు అవసరమైన కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఆస్పత్రి విషయంలో వైసీపీ సర్కారు ముందుకెళ్లినా.. ఇది టీడీపీ హయాంలోనే బీజం పడింది. అలాగే శ్రీకాకుళంలో కలెక్టరేట్‌ను, కేఆర్ స్టేడియాన్ని ఇప్పటికీ పూర్తిచేయలేకపోయారు. వంశధార నాగావళి నదుల అనుసంధానం ఉత్తిమాటగా మిగిలింది. వంశధార ఫేజ్-2 పనులకూ కనీస ప్రాధాన్యం ఇవ్వలేదు. సాగునీటి కాలువల మరమ్మతులకు పైసా విదల్చలేదు. కొత్తగా రోడ్లు నిర్మించలేదు.. పాతరోడ్లకు మరమ్మతులు చేయలేదు. 'నాడు-నేడు' అని పాఠశాలలను కొన్ని బాగుచేసి.. విలీనం పేరుతో అత్యధిక బడులను వృథాగా వదిలేశారు. ఇంటివద్దకే రేషన్ అని చెప్పి.. ఆ వాహనం కోసం కార్డుదారులు ఎదురుచూడాల్సిన దుస్థితి కల్పించారు. నిత్యావసరాల కింద బియ్యం, అరకేజీ పంచదార మాత్రమే విక్రయిస్తున్నారు. అలాగే వైసీపీ నేతలు విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురిచేశారు. శ్రీకాకుళం నుంచి కొత్తరోడ్డుకు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఎడమవైపున నాగావళి నది గట్టుకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలానికి రికార్డుల్లో మార్పుచేసి కోట్లరూపాయలను వైసీపీ కీలక ప్రజాప్రతినిధి అండదండతో కాజేశారు. అన్ని నియోజకవర్గాల్లో అక్రమాలు కోకొల్లలుగా జరిగాయి. ఇసుకను నిర్మాణదారులకు చేరకుండా.. రెండేళ్లు ఇబ్బందులకు గురిచేశారు. ఇక్కడి ఇసుకను విశాఖకు దర్జాగా తరలిస్తూ నాయకులు కోటీశ్వరులయ్యారు. సమస్యలు, హామీల అమలుపై ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులతో భయపెట్టారు. ఉద్యోగులు సైతం రోడ్డెక్కారు. ఇవన్నీ ప్రజలు గమనించారు. ఎన్డీయే కూటమితోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి.. ఈసారి ఎన్నికల్లో వైసీపీకి వ్యతిరేకంగా అధికశాతం మంది ఓటేశారని తెలుస్తోంది.



### ● ఒకటీ రెండు నియోజకవర్గాలపై వైసీపీ ఆశలు..

జిల్లాలో శ్రీకాకుళం లోక్‌సభతో పాటు ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఎంపీగా రామ్మోహన్‌నాయుడు ఈసారి భారీ మెజార్టీతో గెలిచి హ్యాట్రిక్ సాధిస్తారని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి కనీసం బొటాబొటీగానైనా గెలుస్తామని.. ఎంపీ సీటు కైవసం చేసుకుంటామని చెప్పుకోలేకపోతున్నారు. ఇక అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకటీ రెండు చోట్ల మాత్రమే వైసీపీ ఆశలు పెట్టుకుంది. ఎన్నికల సమయంలో పోల్‌మేనేజ్‌మెంట్ అంటూ.. వైసీపీ నాయకులకు అందిన డబ్బులను కొంతమేర కత్తిరించి పంపిణీ చేశారని సమాచారం. సీనియర్ మంత్రి సైతం.. వార్డుల్లో డబ్బుల పంపిణీ విషయంలో అత్యంత తక్కువ మొత్తాన్ని సారథులకు ఇచ్చినట్టు తెలిసింది. ఇటువంటి కారణాలతోనూ ఉన్న కాస్తంత బలాన్ని కూడా ఆపార్టీ నాయకులు వదులుకున్నారు. టీడీపీకి బీజేపీ, జనసేన ఓట్లు కూడా తోడవడంతో.. ఈసారి కూటమికి మెజార్టీతో బాగానే వస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### ప్రజల్లోకి బలంగా వెళ్లిన 'సూపర్ సిక్స్'...

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఈసారి రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరేలా మేనిఫెస్టో రూపొందించారు. సూపర్ సిక్స్ పేరిట పింఛన్ రూ.4వేలకు పెంపు, తల్లికి వందనం పేరిట పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ఏటా రూ.15వేలు చొప్పున, ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండెర్లు, మహిళలకు నెలకు రూ.1500 పంపిణీ చేయనున్నట్టు ప్రకటించారు. యాభై ఏళ్లకే బీసీలకు పెన్షన్, డ్వాక్రా సంఘాలకు రూ.10లక్షలు వరకు వడ్డీలేని రుణం, నిరుద్యోగ భృతి, ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు, ఉచితంగా మహిళలకు బస్సు ప్రయాణం, పూర్ టూ రిచ్.. ఇలా ఎన్నో కార్యక్రమాలకు జనసేనాని పవన్ కల్యాణ్‌తో కలసి షణ్ముఖవ్యూహంగా కొత్తపథకాలను అమలుచేస్తామని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ మేనిఫెస్టోను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారు. దీంతో మహిళా ఓటర్లు, యువత, వృద్ధులు, నిరుద్యోగులు, ఉద్యోగులు సైతం ఎన్డీఏ కూటమి వైపు మొగ్గు చూపారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్గాలవారీగా విడిపోయినా.. అర్బన్ ప్రజలు టీడీపీకే మొగ్గుచూపారని తెలుస్తోంది. ప్రత్యర్థులపై అక్రమ కేసులు.. చంద్రబాబు అరెస్ట్ వంటి పరిణామాలతో వైసీపీ దిగజారగా.. టీడీపీకి మరింత సానుభూతి పెరిగిందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ క్రమంలో ఓట్ల రూపంలో ఎన్డీఏ కూటమికి అనుకూలంగా తీర్పు వస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.



వెంకటాపురం పోలింగ్ కేంద్రంలో తక్కువగా ఉన్న ఓటర్లు (ఫైల్)

## అవగాహన కల్పించినా.. వారంతే

● జిల్లాలో ఓటు వేయనివారు 4,35,049 మంది

(మెళియాపుట్టి)

ప్రజాస్వామ్యంలో ఓటు విలువ గురించి ఎవరు ఎంతలా మొత్తుకుంటున్నా ఇంకా చాలామందిలో మార్పు రావడం లేదు. ఓటుహక్కుపై బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటుతో పాటు అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించినా.. కొంతమందిలో తీరు మారలేదు. ఈసారి 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో లక్షల మంది మనకెందుకులే అనే ధోరణితో వ్యవహరిస్తూ.. ఓటుకు దూరంగా ఉండిపోయారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 18,75,934 మంది. వీరిలో పురుషులు 7,01,016 మంది, మహిళలు 7,39,852 మంది, ట్రాన్స్‌జెండర్స్ 17 మంది మొత్తంగా 14,40,885 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 4,35,049 మంది ఓటుకు దూరంగా ఉన్నారు. జిల్లాలో అధికంగా శ్రీకాకుళం నియోజకవర్గంలో 81,385 మంది ఓటు హక్కును వినియోగించుకోలేదు. ఆమదాలవలసలో 36,010 మంది, పలాసలో 51,716 మంది, టెక్కలిలో 46,055 మంది, పాతపట్నంలో 62,269 మంది ఓటు వేయలేదు. ఇచ్ఛాపురంలో 78,964 మంది, ఎచ్చెర్లలో 40,929 మంది, నరసన్నపేటలో 37,723 మంది ఓటుహక్కు వినియోగించుకోలేదు. వీరంతా ఓటేసి ఉంటే.. పోలింగ్ శాతం మరింత పెరిగేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.



భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

## స్ట్రాంగ్‌రూమ్‌ల పరిశీలన

**కలెక్టరేట్, మే 17:** సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. చిలకపాలెంలోని శివానీ కళాశాలలో స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన మూడంచెల కేంద్ర పోలీసు బలగాల గార్డును, జిల్లా ఆర్మ్‌డ్ పోలీసుగార్డును, సివిల్ పోలీసు బందోబస్తును పరిశీలించి పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణపై ఆరా తీసి, నిరంతర పహారాను తనిఖీ చేయాలని, పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. 24 గంటలూ అత్యంత అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. కలెక్టర్ వెంట శ్రీకాకుళం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సీహెచ్ రంగయ్య, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎవరు చంపేశారు?

- పారిశుధ్య కార్మికుడి హత్య
- నిద్రిస్తుండగానే.. కిరాతకంగా పొడిచి..
- అనుమానితులను విచారిస్తున్న పోలీసులు.. ఘటనపై ఆరా



సురేష్ బాబు (ఫైల్)

**శ్రీకాకుళం క్రైం, మే 17:** రెండేళ్ల కిందట ఆరుగురు యువకులు పట్టపగలు శ్రీకాకుళం నగరం గూనపాలెంలో నడిరోడ్డుపై గొడ్డలితో ఓ వ్యక్తిని నరికి.. మిగిలిన వారిని పరుగులెత్తించారు. అప్పట్లో ఈ ఘటన అలజడి రేపింది. తాజాగా గురువారం అర్ధరాత్రి ఓ పారిశుధ్య కార్మికుడు నిద్రిస్తుండగా.. గుర్తు తెలియని వ్యక్తులు కిరాతకంగా హత్య చేసిన ఘటన వెలుగుచూసింది. కాగా.. ఈ హత్య ఎవరు చేశారనే దానిపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఇందుకు సంబంధించి వన్‌టౌన్ పోలీసులు, కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

శ్రీకాకుళం నగరం గూనపాలెం ప్రాంతానికి చెందిన సీర సురేష్‌బాబు(33) గురువారం అర్ధరాత్రి హత్యకు గురయ్యాడు. సురేష్‌బాబు శ్రీకాకుళం నగరపాలక సంస్థలోని ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికుడు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ నెల 20న వారి వివాహ వార్షికోత్సవం. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం భార్య, పిల్లలతో షాపింగ్‌కు వెళ్లి రాత్రి 8 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. భోజనం చేసిన తర్వాత ఫోన్ రావడంతో రాత్రి పది గంటలకు బయటకు వెళ్లి.. మళ్లీ 11 గంటలకు ఇంటికి వచ్చేశాడు. అప్పటికే సురేష్ భార్య.. రోజూ మాదిరి పిల్లలతో కలిసి.. ఇంటికి ఎదురుగా ఉన్న రుప్ప చంద్రశేఖర్ మేడపై నిద్రించారు. సురేష్ కూడా అక్కడకు వెళ్లి నిద్రించాడు. అర్ధరాత్రి 1.45 గంటల సమయంలో.. భార్య లేచి చూడగా.. సురేష్ రక్తపు మడుగులో విగతజీవిగా కనిపించాడు. వెంటనే అదే వీధిలో నివసిస్తున్న మృతుడి తండ్రి రామయ్యకు.. చంద్రశేఖర్ ద్వారా ఆమె సమాచారం అందజేసింది. రామయ్య బోరున విలపిస్తూ.. వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే రాత్రి గస్తీలో ఉన్న ఎస్ఐ బలివాడ గణేష్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సీఐ ఎల్.సన్యాశినాయుడు క్లూస్ టీంతో పరిశీలించి విచారణ చేపట్టారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గణేష్ తెలిపారు. సురేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

### హత్య వెనుక అనుమానాలెన్నో..

సురేష్‌ది కులాంతర ప్రేమ వివాహం. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఉన్నాయి. సురేష్ భార్య అదృశ్యమైనట్టు జనవరి 2న వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారం రోజుల్లో మళ్లీ ఆమె తిరిగి రావడంతో ఆ కేసు కొట్టేశారు. అలాగే సురేష్‌కు మరో మహిళతో వివాహేతర సంబంధం ఉన్నట్టు భార్య.. పోలీసులకు వివరించింది. ఈ నేపథ్యంలో పోలీసులు ఆమెను కూడా విచారిస్తున్నారు. ఇదిలా ఉండగా గురువారం రాత్రి ఇద్దరు ముగ్గురు వ్యక్తులు హత్య జరిగిన ప్రాంతానికి వచ్చారని మృతుడి భార్య పోలీసులకు, మీడియాకు వివరించింది. అలాగే హత్య సంఘటన తనకు తెలియదని, లేచి చూసేసరికి తన భర్త విగతజీవిగా కనిపించాడని తెలిపింది.

● మృతుడు సురేష్ మెడ మీద కుడివైపు 12 ఇంచీల కత్తి గాటుతో గాయమైంది. పక్కటెముకలో మూడు కత్తి పోట్లు, కుడి, ఎడమ భుజం మీద, వీపు మధ్యలో నాలుగు కత్తిగాట్లు పొడిచి కిరాతకంగా చంపేశారు. ఇది కేవలం ఓ వ్యక్తి వల్ల జరిగే పని కాదు. పైగా పెనుగులాట జరిగిన ఆనవాళ్లు ఉన్నాయి. ఇంత జరిగినా.. మృతుడి భార్య.. తనకు తెలియదని, నిద్రిస్తున్నానని చెప్పడంతో ఆమెను కూడా పోలీసులు విచారణ చేస్తున్నారు. హత్య జరిగిన ప్రాంతంలో ఆమె ఉండగా.. కనీసం రక్తపు మరకలు ఆమెపై లేకపోవడం.. తదితర వివరాలపై ఆరా తీస్తున్నారు. మృతుడి సెల్‌ఫోన్, మరో ఇద్దరు అనుమానితుల ఫోన్ కాల్‌డేటాలను పరిశీలిస్తున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి.. కేసు ఛేదించే పనిలో నిమగ్నమయ్యారు.



సురేష్‌బాబు మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ ఎల్.ఎస్.నాయుడు

## నౌపడ
## ఫీల్డ్‌అసిస్టెంట్ సస్పెన్షన్

**సంతబొమ్మాళి, మే 17:** నౌపడ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ బొమ్మాళి రామారావును సస్పెండ్ చేశామని ఎంపీడీవో ఉమాసుందరి, ఏపీవో వాసునాయుడు తెలిపారు. ఇటీవల వైసీపీ నేతల సభలో రామారావు పాల్గొన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక వెళ్లగా.. రామారావును సస్పెండ్ చేస్తూ.. డ్వామా పీడీ ఆదేశాలు జారీ చేశారని ఎంపీడీవో ఉమాసుందరి తెలిపారు.

## డిగ్రీ సెమిస్టర్ సప్లమెంటరీ ఫలితాలు విడుదల

**ఎచ్చెర్ల, మే 17:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల మొదటి సెమిస్టర్ (ఓల్డ్ రెగ్యులేషన్) సప్లమెంటరీ ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. బీఏ, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీకాం (కంప్యూటర్స్), బీకాం (జనరల్)లో మొత్తం 1146 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కాగా, ఇందులో 629 మంది ఉత్తీర్ణులై 54.89 శాతం ఫలితాలు సాధించారు. ఫలితాల వివరాలను వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞానభూమి పోర్టల్‌లో పొందుపర్చామని పరీక్షల విభాగం డీన్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు.

## కొనసాగుతున్న ఏపీఈఏపీ సెట్

**ఎచ్చెర్ల, మే 17:** ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న ఏపీ ఈఏపీ సెట్ కొనసాగుతోంది. ఈ పరీక్షలు జిల్లాలోని శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం), వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల), ఐతం (టెక్కలి), కోర్ టెక్నాలజీస్ (నరసన్నపేట) కేంద్రాల్లో జరుగుతున్నాయి. శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు షిఫ్ట్‌ల్లో కలిపి 409 మంది విద్యార్థులకుగానూ 380మంది హాజరు కాగా 29 మంది గైర్హాజరయ్యారు. వెంకటేశ్వర కళాశాలలో 360 మందికి 327మంది హాజరుకాగా, 33 మంది గైర్హాజరయ్యారు.



టెక్కలిలో పోలీసుల మోహరింపు..



టీడీపీ నేతలు శేషగిరి, అరుణ్‌కుమార్‌కు నోటీసులిస్తున్న పోలీసులు



# పోర్టు వాహనాలు అడ్డుకుంటారని..

● భారీగా పోలీసుల మోహరింపు ● టీడీపీ నేతలకు నోటీసులు

**టెక్కలి/ సంతబొమ్మాళి, మే 17:** మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు సంబంధించిన వాహనాల రాకపోకలను టీడీపీ నేతలు అడ్డుకుంటారనే ఉద్దేశంతో.. పోలీసులు టెక్కలి, సంతబొమ్మాళి మండలాల్లో శుక్రవారం భారీగా మోహరించారు. ఎన్నికల కోడ్.. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున నిరసనలు చేపట్టరాదని, బయటకు రావద్దంటూ టీడీపీ నేతలు, కార్యకర్తలకు నోటీసులు జారీచేశారు. ఎస్పీ జి.రాధిక పర్యవేక్షణలో నలుగురు డీఎస్పీలు, పదిమంది సీఐలు, 25 మందికి పైగా ఎస్ఐలు, 400 మందికి పైగా పోలీసులు, ప్రత్యేక బలగాలు ముందుగా టెక్కలి చేరుకున్నారు. తర్వాత నౌపడా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. మూలపేట పోర్టు ప్రాంతం నుంచి టెక్కలి వరకు బందోబస్తు ఏర్పాటు చేశారు. టెక్కలి నియోజకవర్గంలోని టీడీపీ నేతలు బగాది శేషగిరి, హనుమంతు రామకృష్ణ, లవకుమార్, పురుషోత్తం, పినకాన అజయ్‌కుమార్, అప్పిని వెంకటేష్, కాంతారావు, బెండి అరుణ్, కర్రి విష్ణు, దల్లి ప్రసాద్‌రెడ్డి, మళ్ల బాలకృష్ణ తదితరులకు నోటీసులు అందజేశారు. పోర్టుకు రాళ్లు తరలిస్తున్న వాహనాలను అడ్డుకోవాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు.. పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చినట్టు తమకు సమాచారం అందిందని పోలీసులు తెలిపారు. జూన్ 6 వరకు ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున.. ప్రస్తుతం జిల్లాలో ర్యాలీలు, సభలు, నిరసనలకు అనుమతి లేదని నోటీసుల్లో స్పష్టం చేశారు. కాగా.. అచ్చెన్నాయుడు ఫిజియోథెరపీతోపాటు విశ్రాంతి కోసం విశాఖలో ఉండగా.. పోలీసులు నోటీసులు జారీచేస్తూ.. భయానక వాతావరణం సృష్టించారని టీడీపీ నేతలు ఆరోపించారు.

● ఇదిలా ఉండగా.. శుక్రవారం ఉదయాన్నే టెక్కలి, నౌపడ, మూలపేట ప్రాంతాలకు భారీగా పోలీసులు చేరుకోవడంతో ఏం జరుగుతుందోనని.. స్థానికులు భయాందోళన చెందారు. గతంలో సంతబొమ్మాళి మండలంలో ఈస్ట్‌కోస్ట్ పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా ఉద్యమం జరిగింది. ఆ సమయంలో గ్రామాల్లో భారీగా పోలీసులు మోహరించేవారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికలు కూడా పూర్తయి.. ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో మళ్లీ పోలీసులు భారీగా మోహరించడంతో.. ఎప్పుడు.. ఏమి జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## ఎవరు గెలిచినా మీదే గెలుపు

### జిల్లా స్థాయి కూపన్ నెం.6

పాఠకుని పూర్తి పేరు : ..............................

డోరు నెంబరు : .................... వీధి పేరు : ....................

గ్రామం/పట్టణం : .................... మండలం : ....................

జిల్లా : .................... పోస్టల్ పిన్‌కోడ్ : .................... ఫోన్ నెం. ....................

శ్రీకాకుళం జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

| నియోజకవర్గం పేరు | NDA కూటమి | YSRCP | కాంగ్రెస్ | ఇతరులు |
|---|---|---|---|---|
| 1. శ్రీకాకుళం | | | | |
| 2. ఎచ్చెర్ల | | | | |
| 3. ఆమదాలవలస | | | | |
| 4. నరసన్నపేట | | | | |
| 5. పాతపట్నం | | | | |
| 6. టెక్కలి | | | | |
| 7. పలాస | | | | |
| 8. ఇచ్ఛాపురం | | | | |
| మొత్తం : | | | | |

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : ఎచ్చెర్ల గ్రామం, ఎచ్చెర్ల మండలం, శ్రీకాకుళం జిల్లా., ఆంధ్రప్రదేశ్., పిన్: 532410

# దిక్సూచి DIKSUCHI

# నిఫ్టెమ్‌లో పీహెచ్‌డీ

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ (నిఫ్టెమ్)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రీసెర్చ్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. సంస్థ నిబంధనల ప్రకారం ఫుల్ టైమ్ అభ్యర్థులకు ఫెలోషిప్ అందిస్తారు.

### రీసెర్చ్ ఎంట్రెన్స్ టెస్ట్

- ఇందులో మూడు దశలు ఉంటాయి. మొదటి దశలో జనరల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంట. కనీసం 40 శాతం మార్కులు సాధించినవారిని మాత్రమే తరవాతి దశలకు అనుమతిస్తారు.
- రెండో దశలో డిపార్ట్‌మెంట్ లెవెల్ రిటెన్ ఎగ్జామ్ ఉంటుంది. ఇది స్పెషలైజేషన్‌కు సంబంధించి ఉంటుంది. ఇందులో ఆబ్జెక్టివ్ ప్రశ్నలు, అబ్‌స్ట్రాక్ట్ రైటింగ్, కేస్ స్టడీస్ ఉంటాయి. పరీక్ష సమయం గంట.
- మూడో దశలో ఇంటర్వ్యూ ఉంటుంది. అభ్యర్థులు ఎంచుకొన్న పరిశోధనాంశానికి సంబంధించి ప్రజెంటేషన్ ఇవ్వాలి. ఇంటర్వ్యూలో కనీసం 50 శాతం స్కోర్ సాధించినవారిని మాత్రమే అడ్మిషన్ ప్రక్రియకు ఎంపిక చేస్తారు.
- డిపార్ట్‌మెంట్ లెవెల్ రిటెన్ ఎగ్జామ్ స్కోర్‌కు 60 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 20 శాతం, అకడమిక్ మెరిట్‌కు 20 శాతం వెయిటేజీ ఇస్తూ విభాగాలవారీగా మెరిట్ జాబితా రూపొందిస్తారు.



**విభాగాలు-సీట్లు:** అగ్రికల్చర్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ విభాగంలో 10 సీట్లు, ఫుడ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ విభాగంలో 10 సీట్లు, ఫుడ్ ఇంజనీరింగ్ విభాగంలో 9 సీట్లు, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో 9 సీట్లు, ఇంటర్ డిసిప్లినరీ సైన్సెస్ విభాగంలో 9 సీట్లు ఉన్నాయి.

**పరిశోధనాంశాలు:** లైఫ్ సైన్సెస్, పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, రిడక్షన్ స్ట్రాటజీస్ ఫర్ ప్లాంట్ ఫుడ్- యాంటీ న్యూట్రిషనల్ ఫాక్టర్స్, నాన్ థర్మల్ ప్రాసెసింగ్, రెన్యూవబుల్ ఎనర్జీ అప్లికేషన్స్, పోస్ట్ హార్వెస్ట్ హార్టికల్చర్ అండ్ టెక్నాలజీ, మష్రూమ్ ప్రొడక్షన్ అండ్ టెక్నాలజీ, ఫుడ్ అండ్ అగ్రీ బిజినెస్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ స్ట్రాటజీ, ఆపరేషన్స్ అండ్ డెసిషన్ సైన్సెస్, ఫైనాన్స్-అకౌంటింగ్-ఎకనామిక్స్, మార్కెటింగ్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హెచ్ఆర్, ఎక్స్‌పెరిమెంటల్ ఫిజిక్స్, నానో మెటీరియల్స్-బయోసెన్సర్స్, మేథమెటికల్ మోడలింగ్(బయాలజీ/ఎకాలజీ/ఇన్ఫెక్షియస్ డిసీజ్), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటేషనల్ మోడలింగ్, బయోపాలిమర్స్, ఫుడ్ సేఫ్టీ, మెషిన్ లెర్నింగ్ ఫుడ్ సేఫ్టీ అండ్ సప్లయ్ చెయిన్, ఫుడ్ ఇంజనీరింగ్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ తదితరాలు.

**అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌తో ఎంఈ/ఎంటెక్/మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. యూజీసీ/సీఎస్ఐఆర్/ఐసీఎంఆర్/ఐకార్ నుంచి నెట్/జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్ అర్హత లేదా జాతీయ స్థాయిలో ఏదేని ఫెలోషిప్ అర్హత ఉన్నవారు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు. వీరిని ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే అభ్యర్థులు పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

### ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 15
- **రీసెర్చ్ ఎంట్రెన్స్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 20న
- **పరీక్ష కేంద్రం:** నిఫ్టెమ్ క్యాంపస్, కుండ్లీ, సోనెపట్ జిల్లా
- **రీసెర్చ్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూలై 1న
- **ఇంటర్వ్యూలు:** జూలై 2, 3
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 8న
- **మొదటి సెమిస్టర్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 12
- **అడ్మిషన్ ప్రక్రియ ముగింపు:** జూలై 15న
- **వెబ్‌సైట్:** www.niftem.ac.in

## Aspire Leaders Program 2024

***Description:*** The global Aspire Leaders Program is a fully funded 14-week online leadership program offered by the Aspire Institute. It has been designed to help students unlock their potential and become well-rounded professionals.
***Eligibility:*** This program is open for students within the age group of 18-29 years. The annual household income of the applicants should be less than 8,00,000. Only first-generation learners are eligible to apply for the program. Participants who have enrolled in or completed an undergraduate program in the last three years can apply. Applicants must have an intermediate level of proficiency in English.
***Prizes & Rewards:*** Free access to training modules, live sessions by Havard faculty, and much more
***Last Date to Apply:*** 03-07-2024
***Application mode:*** Online applications
***Short Url:*** www.b4s.in/aj/ALPS1

## SCHOLARSHIP ALERT

## Mirae Asset Foundation Scholarship Program

***Description:*** Mirae Asset Foundation invites applications from students who are currently pursuing undergraduate or postgraduate courses across India.
***Eligibility:*** Open to students who are currently pursuing undergraduate or postgraduate courses across India. Applicants must have scored at least 60% in the previous academic year. The annual family income of the applicants must not exceed INR 8,00,000.
***Prizes & Rewards:*** Scholarships up to INR 50,000
***Last Date to Apply:*** 26-06-2024
***Application mode:*** Online applications
***Short Url:*** www.b4s.in/aj/MAFS1

## India Fellow Social Leadership Program



***Description:*** India Fellow Social Leadership Program 2024-25 is an opportunity offered by the India Fellow for graduate students and young professionals between 20 and 30 years of age. It is an 18-month leadership program designed to help participants develop their skills and make a positive impact on communities.
***Eligibility:*** Open for Indian citizens aged between 20 to 30 years. Applicants must be graduates in any discipline or about to complete graduation by the fellowship start date. Students must be ready for an 18-month full-time commitment to the fellowship and prepared to be placed in any part of the country and any thematic area.
***Prizes & Rewards:*** A monthly stipend of up to 22,000 and other benefits
***Last Date to Apply:*** 31-05-2024
***Application:*** Online applications
***Short Url:*** www.b4s.in/aj/IFSA2

buddy4study.com

## ఏపీ ఏకలవ్య గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలు



గుంటూరు జిల్లా-తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఏపీటీడబ్ల్యూఆర్ఈఐఎస్)- పదకొండో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 19 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఎటువంటి ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. పదోతరగతి మార్కుల ఆధారంగా ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈపీ గ్రూప్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఈఎంఆర్ఎస్ విద్యార్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. సీట్లు మిగిలిన పక్షంలో మాత్రమే ఇతరులకు అవకాశం కల్పిస్తారు. బోధన, వసతి ఉచితం. అభ్యర్థుల ఆసక్తి మేరకు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు సంబంధించి ప్రత్యేక శిక్షణ అందిస్తారు. అర్హతలు ఉన్న అభ్యర్థులు ఈ నెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలి.

**సీట్ల వివరాలు:** ప్రతి ఈఎంఆర్ స్కూల్లో గ్రూప్‌నకు 30 సీట్లు ఉన్నాయి. ఒక్కో గ్రూప్‌లో 570 సీట్లు చొప్పున మొత్తం 1,710 సీట్లు ఉన్నాయి. వీటిలో 80 శాతం సీట్లను ఎస్టీ అభ్యర్థులకు ప్రత్యేకించారు. మిగిలిన సీట్లను రిజర్వ్‌డ్ వర్గాలు, అనాథలు, వితంతువుల పిల్లలు, దివ్యాంగుల పిల్లలకు కేటాయించారు.

### గ్రూప్‌లు-సబ్జెక్టులు

**ఎంపీసీ సబ్జెక్టులు:** ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్/బయాలజీ/హిందీ/రీజనల్ లాంగ్వేజ్/ఏదేని ఇతర సబ్జెక్ట్

**బైపీసీ సబ్జెక్టులు:** ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ సైన్స్/హిందీ/రీజనల్ లాంగ్వేజ్/ఏదేని ఇతర సబ్జెక్ట్

**హ్యూమానిటీస్ సబ్జెక్టులు:** ఇంగ్లీష్, హిస్టరీ; ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, హిందీ నుంచి రెండు సబ్జెక్టులు; రీజనల్ లాంగ్వేజ్/ఏదేని ఇతర సబ్జెక్టు అదనంగా ఆరో సబ్జెక్టు కింద ఈఎంఆర్ఎస్ అందిస్తున్న వాటిలో ఒకదాన్ని ఎంచుకోవచ్చు.

**ఎంపిక:** ఎంపీసీ గ్రూప్‌లో ప్రవేశానికి పదోతరగతిలో సాధించిన టోటల్ మార్కులు; సైన్స్, మేథమెటిక్స్‌లో సాధించిన మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు.

- బైపీసీ గ్రూప్‌లో ప్రవేశానికి పదోతరగతిలో సాధించిన టోటల్ మార్కులు, సైన్స్ మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు.
- **వెబ్‌సైట్:** www.aptwgurukulam.ap.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/cqx1uEMలో చదవండి.

## జాబ్ కార్నర్

## టీఎస్ సెట్ - 2024

తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష(టీఎస్ సెట్)-2024 నోటిఫికేషన్‌ను ఉస్మానియా యూనివర్సిటీ విడుదల చేసింది. రాష్ట్రంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్ నియామకాలకు అర్హత సాధించేందుకు ఈ పరీక్షను ఉద్దేశించారు.

**సబ్జెక్టులు:** జనరల్ పేపర్ ఆన్ టీచింగ్ అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్(పేపర్-1), జాగ్రఫీ, కెమికల్ సైన్సెస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లీష్, ఎర్త్ సైన్స్, లైఫ్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తెలుగు, ఉర్దూ, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, సంస్కృతం, సోషల్ వర్క్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, లింగ్విస్టిక్స్.

**అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

**పరీక్ష ఫీజు:** ఓసీలకు రూ.2000. బీసీ/ఈడబ్ల్యూఎస్‌లకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ, వీహెచ్, హెచ్ఐ, ఓహెచ్, ట్రాన్స్‌జెండర్‌లకు రూ.1000.

**పరీక్ష కేంద్రాలు:** ఆదిలాబాద్, నిజామాబాద్, విజయవాడ, హైదరాబాద్, వరంగల్, కర్నూలు, కరీంనగర్, ఖమ్మం, తిరుపతి, మహబూబ్‌నగర్, వైజాగ్, నల్లగొండ

**చివరి తేదీ:** జూలై 2

**పరీక్ష తేదీలు:** 2024 ఆగస్టు 28 నుంచి 31 వరకు

**వెబ్‌సైట్:** telanganaset.org/index.html

# నవ్య | చిత్రజ్యోతి

## ఆ ప్రత్యేక వ్యక్తి ఎవరు?



తన సినిమా ప్రచార కార్యక్రమాలపైన సైతం ఆచితూచి స్పందిస్తారు ప్రభాస్. అలాంటిది శుక్రవారం ఆయన సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ ఒక్కసారిగా నెటిజన్లలో చర్చనీయాంశం అయింది. 'డార్లింగ్స్ ఎట్టకేలకు మన జీవితాల్లోకి ఒక ప్రత్యేక వ్యక్తి రాబోతున్నారు, వేచి చూడండి' అంటూ ఆయన ఇన్‌స్టాలో పెట్టిన పోస్ట్ క్షణాల్లో వైరల్ అవ్వడంతో పాటు పలు రకాల ఊహాగానాలకు తెరలేపింది. మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్‌గా ఉన్న ప్రభాస్ ఓ ఇంటివాడవబోతున్నారు అని, తన కాబోయే జోడీని పరిచయం చేయబోతున్నారనీ కొందరు నెటిజన్లు స్పందిస్తున్నారు. అయితే త్వరలో 'కల్కి 2898 ఏడీ' చిత్రం విడుదల ఉండడంతో ఆ సినిమా అప్డేట్ గురించి ప్రభాస్ ఇలా స్పందించారంటూ మరికొందరు భావిస్తున్నారు. 'కల్కి' చిత్రంలో కమల్‌హాసన్, దీపికా పదుకొనేకు సంబంధించిన ప్రచార చిత్రాలను విడుదల చేయబోతున్నారనీ, దానికోసమే ప్రభాస్ ఈ పోస్ట్ పెట్టాడని సినీ వర్గాలు చెబుతున్నాయి. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

## కన్నప్ప కోసం కాజల్



మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' లో నటించే స్టార్స్ సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. మొన్న బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్, నిన్న ప్రభాస్, తాజాగా ఇప్పుడు కాజల్. ఇలా రోజుకో స్టార్ ఎంట్రీతో, అప్డేట్స్‌తో 'కన్నప్ప' చిత్రం నేషనల్ వైడ్‌గా ట్రెండ్ అవుతోంది. ఈ సినిమాలో ఓ కీలక పాత్రలో కాజల్ నటిస్తున్నట్లు ప్రకటించారు. ఇంతకు ముందు 'మోసగాళ్లు' చిత్రంలో విష్ణు, కాజల్ నటించిన సంగతి విదితమే. ఇప్పుడు మరోసారి విష్ణు సినిమాలో కాజల్ నటిస్తున్నారు. డాక్టర్ మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ భారీ చిత్రానికి ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకుడు. న్యూజిలాండ్‌లో 'కన్నప్ప' చిత్రానికి సంబంధించిన రెండు మేజర్ షెడ్యూల్స్ జరిగాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతోంది. ఈ నెల 20న కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'కన్నప్ప' టీజర్ విడుదల చేయనున్నారు.

## బుల్లితెర నటుడు చందు ఆత్మహత్య



బుల్లితెర నటుడు చందు ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. డిప్రెషన్‌తోనే ఆయన ఈ దారుణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. శుక్రవారం హైదరాబాద్ మణికొండలోని ఆయన ఇంట్లో ఈ దుర్ఘటన జరిగింది. టీవీ నటి పవిత్ర జయరాం రోడ్డు ప్రమాదంలో చనిపోయాక చందు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తనకు బ్రెయిన్‌కు సంబంధించిన వ్యాధి ఉందని, ఇంకొన్నాళ్లే బతుకుతానని చెప్పారు. ఆత్మహత్యకు ముందు 'ఈ రోజు పవిత్ర పుట్టిన రోజు నన్ను రమ్మంటోంది అని సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. త్రినయని, కార్తీకదీపం లాంటి సీరియళ్లతో చందు నటుడిగా గుర్తింపు పొందారు. ఆయనకు భార్య శిల్ప, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## ఇండియన్ నేటివిటీతో పోకెమాన్

పిల్లలను అమితంగా ఆకర్షించిన యానిమేషన్ సిరీస్‌ల్లో 'పోకెమాన్'కు ప్రత్యేక స్థానం ఉంది. ఇప్పుడు 'పోకెమాన్ హారిజన్స్' పేరుతో సరికొత్తగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సిరీస్‌లో ప్రీమియర్ ఎపిసోడ్‌ను హంగామా టీవీలో ఈ నెల 25న స్ట్రీమింగ్ చేయబోతున్నారు. భారతీయ ప్రేక్షకుల అభిరుచిని దృష్టిలో ఉంచుకొని దీన్ని రూపొందించినట్లు మేకర్స్ తెలిపారు. కథలో ఇక్కడి నేటివిటీకి తగ్గట్లు మార్పులు చేయడంతో పాటు పలువురు ఇండియన్ ఆర్టిస్టులు మేకింగ్‌లో భాగమయ్యారు. ప్రముఖ సంగీత దర్శకులు



విశాల్ - శేఖర్ సంగీతం అందించగా గాయకులు అర్మాన్ మాలిక్, హీరోయిన్ షిర్లే సేటియా ఇందులోని పాత్రలకు తమ గొంతును అందించారు. 'చిన్నప్పుడు పోకెమాన్ టాయ్స్ కలెక్ట్ చేశాను. ఇప్పుడు ఈ సిరీస్‌లోని పాత్రలకు డబ్బింగ్ చెప్పడం మర్చిపోలేని అనుభవం' అన్నారు షిర్లే సేటియా.





ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తెలుగు చలనచిత్ర దర్శకులు అనిల్ రావిపూడి, హరీశ్‌శంకర్‌లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డైరెక్టర్స్ డే సందర్భంగా ఈనెల 19న నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రిని సన్మానించారు.

## కొత్త తరహా కంటెంట్‌తో...



శాంతి చంద్ర హీరోగా, మాజీ మిస్ ఇండియా స్మిమితి కథానాయికగా నటిస్తున్న చిత్రం 'డర్టీ ఫెలో'. దీపిక సింగ్, సత్యప్రకాశ్, నాగినీడు కీలకపాత్రలు పోషిస్తున్నారు. అడారి మూర్తి సాయి దర్శకత్వంలో జి.ఎస్ బాబు నిర్మించారు. ఈ నెల 24న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు వశిష్ఠ చేతుల మీదుగా యూనిట్ ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా వశిష్ఠ మాట్లాడుతూ 'కొత్త తరహా కంటెంట్‌తో ఈ చిత్రం తెరకెక్కుతోందని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉన్నాయి. దర్శకుడి శైలి ఈ సినిమాను ప్రత్యేకంగా నిలబెడుతుంది' అని అన్నారు. శాంతి చంద్ర మాట్లాడుతూ 'డర్టీఫెలో ఆడియోకు చక్కటి స్పందన వచ్చింది. సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది' అన్నారు.

## ఎంటర్‌టైన్ చేసే లారీ



శ్రీకాంత్‌రెడ్డి ఆసం హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'లారీ ఛాప్టర్ - 1'. చంద్ర శిఖ కథానాయిక. రాఖీ సింగ్ కీలకపాత్ర పోషించారు. ఆసం వెంకట లక్ష్మి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను యూనిట్ గురువారం విడుదల చేసింది. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ 'డైరెక్షన్ కోర్స్ చేశాక యూట్యూబ్‌లో వీడియోలు చేశాను. తర్వాత పలు చిత్రాలకు వివిధ విభాగాల్లో సహాయకుడిగా పనిచేసి అనుభవం గడించాను. ఇప్పుడు 'లారీ ఛాప్టర్-1' అనే సినిమాతో హీరోగా వస్తున్నాను. ఇదొక సరికొత్త యాక్షన్ ఎంటర్టైనర్. తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ విడుదల చేస్తున్నాం. త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: తాడిపత్రి నాగార్జున.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/HhJ3Ouoలో చదవండి.

# చలమల నీరే ఆధారం

- నది చెంతన ఉన్నా... నీటికి ఇక్కట్లే
- ఇదీ దబ్బపాడు వాసుల దుస్థితి



వంశధార నదిలో చలమల నీటిని పట్టుకుంటున్న మహిళలు

**దబ్బపాడు (ఎల్.ఎన్.పేట), మే 17**

ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ తాగునీటి సమస్య పరిష్కారం కావడం లేదని మండలంలోని దబ్బపాడు గ్రామానికి చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంశధార నది పక్కనే ఉన్నప్పటికీ ఏటా తాగునీటికి కష్టాలు తప్పడం లేదని పి.సీతారాం, పి.రామారావు, ఆర్.సరోజిని తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మీనర్సుపేటలో మెగా రక్షిత మంచినీటి పథకం ఉన్నప్పటికీ గ్రామంలోని కొళాయిలకు నీరు రాక పోవటంతో తాగునీటికి ఇబ్బందులు పడవలసి వస్తోందని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు వచ్చి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీలిస్తున్నారని... పోలింగ్ అయిన వెంటనే హామీలను మరచిపోతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో నిత్యం నదిలోని చలమల నీరే ఉపయోగించవలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం, వేసవికాలం అనే తేడా లేకుండా చలమల నీటినే తాగడానికి ఉపయోగిస్తున్నామని తెలిపారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా గ్రామానికి తాగునీటి సమస్య మాత్రం తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో రక్షిత మంచినీటి పథకాలు ఉన్నప్పటికీ నిర్వహణకు నిధులు లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయని... ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

### ఊట నీరే ఆధారం



- వంశధార నది పక్కనే ఉన్నప్పటికీ తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. నిత్యం నదిలో చలమలు తీసుకొని ఊటనీటిని తాగునీటిగా ఉపయోగించుకుంటున్నాం. ఎన్నికలు వచ్చినపుడు రాజకీయ నాయకులు గ్రామానికి వచ్చి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని వాగ్దానాలిచ్చి ఆ తరువాత మరచిపోతున్నారు. అధికారులు మా గ్రామంపై దృష్టి పెట్టి తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

-పి. సీతారాం, దబ్బపాడు గ్రామం

### ఏళ్ల తరబడి అదే సమస్య..



- తరాలు మారినా తాగునీటి సమస్య తీరడం లేదు. వర్షాకాలం వచ్చిందంటే నది మధ్యకు వెళ్లి చలమల ద్వారా నీటిని తీసుకురావలసి వస్తోంది. వేసవి కాలంలో కష్టాలు చెప్పనలవి కాదు. తరతరాలుగా తాగునీటి సమస్య తీరటంలేదు.

-పి.రామారావు, దబ్బపాడు గ్రామం, ఎల్.ఎన్.పేట మండలం

## రాతికర్ర చెరువులో ఆక్రమణల తొలగింపు

**నరసన్నపేట, మే 17:** స్థానిక సంతతోట వద్ద గల రాతి కర్ర చెరువులో ఆక్రమణలను పంచాయతీ అధికారులు శుక్రవారం తొలగించారు. గత కొన్నాళ్లుగా చెరువు గర్భాన్ని కొందరు ఆక్రమించుకొని...మట్టితో కప్పేస్తున్నారు. దీనిపై స్థానికులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఎట్టకేలకు స్పందించి ఆక్రమణలను తొలగించారు. జాతీయ రహదారి పక్కన మసీదు సమీపంలో గల చెరువులో కూడా ఆక్రమణదారులు మట్టి వేస్తున్నారు. సోమవారం సంత స్థలాన్ని కూడా ఆక్రమించుకున్నారు. సంతలో కూడా ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ తొలగింపులో కూడా కొందరు పంచాయతీ అధికారులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని.. పూర్తి స్థాయిలో ఆక్రమణలను తొలగించలేదని తెలుస్తోంది.

## మణప్పురం ఫైనాన్స్‌కు ఆదిత్య విద్యార్థులు

**టెక్కలి, మే 17:** కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎంబీఏ విద్యార్థులు ఐదుగురు మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీకి వివిధ హోదాల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో రాత, మౌఖిక పరీక్షల అనంతరం వీరిని ఎంపిక చేశారని తెలిపారు. ఒక్కొక్కరికి రూ.2.7 లక్షల వేతనం, ఇతర అలవెన్సులు చెల్లించేందుకు కంపెనీ అంగీకరించిందన్నారు. వీరితో పాటు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డాక్టర్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

## గ్రామదేవతకు మహా నైవేద్యం



ఘటాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

**ఎల్.ఎన్.పేట, మే 17:** లక్ష్మీనర్సుపేట గ్రామంలో జరుగుతున్న బంగారు సంతోషిమాత (గ్రామదేవత) ఉత్సవాల కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం గ్రామదేవతకు వివిధ రకాల వంటకాలతో స్థానికులు మహానైవేద్యం సమర్పించారు. శుక్రవారం ఉదయం నుండి భక్తిశ్రద్ధలతో మహిళలందరూ పూజలుచేసి అమ్మవారి ఆశీర్వాదం అందుకున్నారు. అనంతరం ఘటాలకు పూలమాలలతో అలంకరించి మంగళవాయిద్యాలతో గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగించారు. గ్రామదేవత మండపం వద్ద ఘటాలను భద్రపరిచారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ఎం.జనార్దనరావు, వి.పాండురంగనాథరాజు, రామ్‌నాథ్ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాములు జీవితం ఆదర్శం

- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తులసీదాస్



సంస్మరణ సభలో మాట్లాడుతున్న తులసీరావు

**వజ్రపుకొత్తూరు :** బమ్మిడి శ్రీరాములు జీవితం ఆదర్శనీయమని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. శుక్రవారం నగరంపల్లిలో శ్రీరాముల సంస్మరణ సభ జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తులసీదాస్ మాట్లాడుతూ శ్రీరాములు అందించిన సేవలను వివరించారు. జనం కోసం నిత్యం పరితపించారని పేర్కొన్నారు. అఖిల భారత వ్యవసాయ కూలీ కార్మిక సంఘం నాయకులు తడాల సుబ్బారావు మాట్లాడుతూ కమ్యూనిస్టుల జీవితం సమాజానికి ఉపయోగపడాలని శ్రీరాములు నిత్యం ఆలోచించేవారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు మాట్లాడుతూ సంఘాల నిర్మాణం... కొనసాగింపు, గిరిజన ఉద్యమాలలో బమ్మిడి శ్రీరాముల పాత్రను వివరించారు. సమావేశంలో నాయకులు మోహనరావు, తిరుపతిరావు, కార్మిక సంఘం నాయకులు టి.తిరుపతిరావు ప్రజా సంఘాల నాయకులు కుసుమ తదితరులు పాల్గొన్నారు.

## కేన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న యువతరం సేవా సమితి ప్రతినిధులు

**వజ్రపుకొత్తూరు:** రామకృష్ణాపురానికి చెందిన జానకమ్మ కేన్సర్, కిడ్నీ వ్యాధులతో బాధ పడుతోంది. విషయం తెలుసుకున్న యువతరం సేవాసమితి సభ్యులు శుక్రవారం జానకమ్మకు రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆమె భర్త కూడా అనారోగ్యంతో మృతి చెందడంతో కుమార్తెతో కలసి ఉంటోంది. సేవాసమితి అధ్యక్షులు మురళి, సునీల్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## చెత్త సేకరణ కేంద్రాలపై దృష్టి

**నందిగాం:** చెత్త సేకరణ కేంద్రాల నిర్వహణ పక్కాగా చేపట్టాలని డివిజినల్ పంచాయతీ అధికారి ఐ.వెంకటరమణ అన్నారు. శుక్రవారం నందిగాం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. పంచాయతీల వారీగా వివిధ అంశాలపై సమీక్షిస్తూ పంచాయతీల ఆర్థిక పరిపుష్టికి వీలుగా చెత్త సేకరణ కేంద్రాలను తీర్చిదిద్దాలన్నారు. గ్రంథాలయ పన్ను, కరెంటు చార్జీలు, ఇంటి పన్ను బకాయిల వసూలుపై ఆరా తీశారు.



## జీరుకు జాతీయ పురస్కారం



జీరు మోహనరావు

**నందిగాం, మే 17:** నందిగాం మండలం నరేంద్రపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ సాంస్కృతిక విభాగ ప్రతినిధి జీరు మోహనరావు జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో 2024 ఉత్సవాలను పురస్కరించుకొని పౌరాణిక భజన కళారంగంలో విశిష్ట సేవలు అందించినందుకు గాను ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 19న ఒంగోలులో జరిగే కార్యక్రమంలో పురస్కారం అందించనున్నట్లు జాతీయ చైర్మన్ పోలోజు రాజకుమార్, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎ.భాస్కరాచార్యులు సమాచారం అందించారు. జీరు మోహనరావు పురస్కారానికి ఎంపిక కావడం పట్ల స్థానిక సర్పంచ్ బి.సన్యాసిరావు, మాజీ పీఏసీఎస్ ఉపాధ్యక్షులు కె.ధర్మారావు, భజన బృందం సభ్యులు అభినందించారు.

## అగ్ని వర్షం కురిసినట్టు...

**పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో శుక్రవారం ఉదయం 5 నుంచి 5.30 గంటల వరకూ ఆకాశంలో మేఘాలు వింత రంగులతో అలరించాయి. సూర్యోదయానికి కాసేపటి ముందు మేఘాలు అగ్ని వర్షం కురిసినట్టు కనిపించాయి. ఈ దృశ్యాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.**

-పలాస రూరల్



# నేటి నుంచి బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలు

- అంగరంగ వైభవంగా నిర్వహణకు ఏర్పాట్లు
- పట్టణంలో ఒంటెలతో శోభాయాత్ర

**నరసన్నపేట, మే 17:** శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాల నిర్వహణకు ముమ్మరంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈనెల 27 వరకు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా ఆ వివిధ వాహనాల్లో స్వామివారికి తిరువీధులు నిర్వహించనున్నారు. ఈ నెల 19న హంస వాహనసేవ, 20న శేష వాహన సేవ, 21న అశ్వవాహనం, 22న హనుమంత వాహనం, 23న గరుడ వాహనం, 24న సింహవాహనం, 25న చంద్రవాహనం, 26న గజవాహనం, 27న సూర్యప్రభ వాహన సేవలను నిర్వహించనున్నారు. తిరువీధుల్లో వాహన సేవకు ముందుగా ఒంటెలు, గుర్రాలతో ఊరేగింపు నిర్వహిస్తారు. శుక్రవారం పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. ఆలయాన్ని వివిధ రకాల పూలతో అలంకరించారు.



పూలమాలలు సిద్ధం చేస్తున్న భక్తులు

### వేంకటేశ్వరుని వార్షికోత్సవాలు ప్రారంభం..

**నందిగాం:** పెంటూరులో కొలువై ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థాన 22వ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్తలు బొడ్డ జనార్దనరావు, కృష్ణా రావుల ఆధ్వర్యంలో శ్రీకూర్మానికి చెందిన గోపి నంబాళ్ల వెంకటదాస్ కూర్మాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు డి.రవిరామా చార్యులు పర్యవేక్షణలో విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, నిత్య ప్రబోధిక, సాయంత్రం విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, అంకురార్పణం, విశేష హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శనివారం గరుడ ప్రతిష్ఠ, ధ్వజారోహణ, గరుడవాహన సేవ, ఊరేగింపు ఉంటుందని తెలిపారు.



మూలవిరాట్‌ను అలంకరించిన దృశ్యం



లింగాలవలసలో పూజలందుకుంటున్న వీరబ్రహ్మేంద్రస్వామి

## ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన

**జలుమూరు, మే 17:** లింగాలవలస గ్రామంలో కొలువుదీరిన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారి ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ పంచవృత్తుల సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పంచామృతాభిషేకాలు చేయించారు. ఇదిలా ఉండగా...ఈనెల 19న ఆదివారం శ్రీ పోలేరమ్మ గ్రామదేవత జాతర నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం అమ్మవారికి ముర్రాటలతో ఊరేగింపు నిర్వహించి గ్రామదేవతకు చల్లదనం చేస్తామన్నారు.

## గోపాలపెంటలో పోలీసు పహారా

**నరసన్నపేట, మే 17:** గోపాలపెంట గ్రామంలో పోలీసులు పహారా కాస్తున్నట్లు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. పోలింగ్ రోజున గ్రామంలో జనసేన కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. దీంతో భవిష్యత్‌లో గ్రామంలో ఎటువంటి తగాదాలు లేకుండా పోలీసులు పహారా కాస్తున్నట్లు తెలిపారు. శాంతియుత వాతావరణం నెలకొనేందుకు ప్రజలకు అవగాహన కల్పించినట్లు ఎస్ఐ అశోక్‌బాబు చెప్పారు.



గోపాలపెంటలో పహారా కాస్తున్న ఎస్ఐ అశోక్‌బాబు, సిబ్బంది

## బడిబయట ఉన్న 12 మంది గుర్తింపు



జలుమూరులో సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు

**జలుమూరు, మే 17:** మండలంలో బడి బయట ఉన్న 18 సంవత్సరాల లోపు వయసు గల 12 మంది దివ్యాంగులను ఇంటింటా సర్వే చేసి గుర్తించినట్లు సహిత ఉపాధ్యాయులు కృష్ణప్రసాద్, రమేష్ తెలిపారు. సమగ్రశిక్ష డైరెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జలుమూరులో శుక్రవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వారం రోజులుగా ఇంటింటా సర్వే నిర్వహించి బడి బయట ఉన్న దివ్యాంగులను గుర్తించామన్నారు. వీరికి సమీపంలో గల ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్ల లోపు వయసు గల దివ్యాంగులు బడి బయట ఉంటే సమాచారం ఇవ్వాలని ప్రజలను వారు కోరారు.

# అవగాహనతోనే రక్తపోటు నివారణ



తురకపేట గ్రామంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

**తురకపేట(ఎల్.ఎన్.పేట), మే 17:** వివిధ రకాల వ్యాధులపై అవగాహన కలిగి ఉంటే.. వాటిని నివారించడం సాధ్యమవుతుందని వైద్యాధికారులు ఎ.లక్ష్మీదీప్, నీతూలు తెలిపారు. ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం సందర్భంగా తురకపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. లక్ష్మీనర్సుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రియాంక, సునీత, సూపర్‌వైజర్స్ ఈశ్వరమ్మ, బి.జనార్దనరావు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

### వ్యాయామంతో ఆరోగ్యం..

**పోలాకి:** ఆరోగ్యకర జీవనానికి వ్యాయామం ఎంతో అవసరమని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు బి. శ్రీనాథ్, విస్తరణాధికారి నల్లి రవికుమార్ అన్నారు. శుక్రవారం ప్రపంచ హైపర్‌టెన్షన్ దినం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్య వ్యాయామంతో హైపర్‌టెన్షన్, గుండె సంబంధిత వ్యాధులు రాకుండా నివారించవచ్చన్నారు. ఆధునిక ఆహారపు అలవాట్లు మానసిక ఒత్తిడి హైపర్‌టెన్షన్‌కు కారణమన్నారు. ఆరోగ్య కేంద్రం నుంచి పోలాకి కూడలి వరకూ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలాకి, చెల్లాయివలస, దీర్ఘాశి, ఈదులవలస, తలసముద్రం, డోల, గొల్లలవలసకు చెందిన ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు. గుప్పెడుపేట ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి చందన్, రత్నరాజ్ ఆధ్వర్యంలో హైపర్‌టెన్షన్ దినాన్ని నిర్వహించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పోలాకి ఆరోగ్య కేంద్ర సిబ్బంది

# అరకొర వసతులే!


గారలోని హాస్టల్ భవనంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

- పరాయి పంచన అంగన్‌వాడీ కేంద్రాలు
- కానరాని సదుపాయాలు.. ● ఏళ్ల తరబడి ఇంతే..

(గార)

రెండు దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన గార ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో చాలా అంగన్‌వాడీ కేంద్రాలు నేటికి కూడా పరాయి పంచన కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టు పరిధిలో శ్రీకాకుళం మండలం, గార మండలాలు ఉన్నాయి. గార మండలంలో 125 కేంద్రాలు ఉండగా, వీటిలో 48 స్వంత భవనాలు ఉన్నవి కాగా, మిగిలిన వాటిలో 29 అద్దె గదుల్లోను, 51 కేంద్రాలు పాఠశాల భవనాల వద్ద నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం మంలంలో 101 అంగన్‌డీ కేంద్రాలు ఉండగా, వీటిలో 55 స్వంత భవనాలు ఉన్నాయి. మిగిలిన వాటిలో 24 పాఠశాల భవనాలు వద్ద 22 అద్దె గదుల్లో నిర్వహిస్తున్నారు. నాడు-నేడు నిధులతో ప్రాజెక్టు పరిధిలో గార మండలంలో చిన్నవత్సవలస, జల్లపేట, ఎస్‌డీఎస్ పేట, సెగిడిపేట, శ్రీకూర్మం-1, లింగాలవలస, పేర్లవానిపేట, కొత్తూరు గ్రామాల్లో కొత్తగా భవనాలు మంజూరు కాగా వివిధ దశల్లో ఉన్నాయి. శ్రీకాకుళం మండలంలో తంగివానిపేట, వప్పంగి-3, శాస్త్రులపేట, లంకాం గ్రామాల్లో కొత్త భవనాలు మంజూరు కాగా ఇవీ కూడా వివిధ దశల్లో ఉన్నాయి. చిన్నారులకు అదనపు పౌష్టికాహారం అందించడం ద్వారా వారికి ఆటపాటలు ద్వారా నిత్యం కేంద్రానికి రావడం అలవాటు చేసే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల్లో స్వంత భవనాలు లేక పరాయిపంచన చిన్న చిన్న గదుల్లో, పాఠశాల వరండాలు పైన నిర్వహించాల్సి వస్తోంది. ఎండా, వాన సమయాల్లో చిన్నారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేసే సామగ్రి పిల్లల ఆట వస్తువులు ఆహార దినుసులు కూడా భద్రపరచడానికి, వంట గది లేక సిబ్బంది అవస్థలు పడుతున్నారు. చాలా గ్రామాల్లో భవనాలు నిర్మాణానికి అవసరమైన స్థలాలు ఉన్నప్పటికి భవనాలు మంజూరు లేక నేటికి కూడా సొంత భవనాలకు నోచుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కొత్త భవనాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

**హరిపురం:** మందస రోడ్ (హరిపురం) రైల్వేస్టేషన్ పరిధిలో రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం మృతిచెందాడు. మృతుడి వయసు సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందని, తెల్లని షర్టు, ఫ్యాంటు వేసుకొని ఉన్నాడని చెప్పారు. ఒడిశా నుంచి విశాఖ వైపు వెళ్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందినట్టు పోలీసులు బావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని పలాస జీఆర్‌పీ పోలీసులు పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వనదుర్గమ్మ విగ్రహం ధ్వంసం?


రెండు ముక్కలైన వనదుర్గమ్మ తల్లి విగ్రహం

**టెక్కలి:** మేఘవరం పంచాయతీ జక్కరపేట జంక్షన్ సమీపంలో వనదుర్గమ్మ తల్లి విగ్రహాన్ని ఎవరో గుర్తుతెలియనివారు ధ్వంసం చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండు రోజుల కిందట జరిగిన ఈ ఘటన ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఎలా జరిగిందన్న అంశంపై ఆరాతీస్తున్నారు. గిరిజనులు, గ్రానైట్ క్వారీల కార్మికులు ఎంతో పవిత్రంగా పూజించిన వనదుర్గమ్మ విగ్రహం ధ్వంసం కావడంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. కాగా ఈ విషయమై సీఐ పి.పైడయ్య మాట్లాడుతూ.. పిండి విగ్రహం కావడంతో రెండు ముక్కలైందని స్థానిక గిరిజనులే సమాచారం ఇచ్చారని, ఈ విగ్రహాన్ని ఎవరూ ధ్వంసం చేయలేదని వారు చెబుతున్నట్టు సీఐ స్పష్టం చేశారు.

## ఇద్దరికి ఏడేళ్లు జైలు

**హిరమండలం:** తంప గ్రామానికి చెందిన బోయితి తిరుపతిరావు, మిన్నమ్మలకు ఏడేళ్ల జైలు శిక్ష విధించినట్టు ఎస్ఐ నారాయణస్వామి చెప్పారు. శుక్రవారం ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. తంప గ్రామంలో 2020లో వరకట్న వేధింపులతో హారతి అనే మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. అప్పట్లో పాలకొండ డీఎస్పీ రారాజు ప్రసాద్ మృతిరాలి భర్త తిరుపతిరావు, అత్త మిన్నమ్మలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సోంపేటకు చెందిన ఆరో అదనపు సెషన్స్ న్యాయాధికారి బి.భాస్కరరావు శుక్రవారం ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పార. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.వెంకటరావు కేసు వాదించగా, ఎస్ఐ నారాయణస్వామి ఇందుకు సంబంధించిన సాక్షాధారాలు సేకరించారు.

## కారు అద్దెకు తెచ్చి.. మోసం

**శ్రీకాకుళం క్రైం:** ఇటీవల నగరంలోని కేఎఫ్‌సీ షాపు సిబ్బందిపై దాడి చేసిన ఘటనలో ఉన్న ఓ రౌడీషీటర్.. ఆ కేసు సద్దుమనగక ముందే ఓ కారు అద్దెకు తెచ్చి మోసం చేసిన ఘటన వెలుగుచూసింది. టూ టౌన్ పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు శ్రీకాకుళం నగరానికి చెందిన కొత్తకోట శేఖర్‌పై 2023లో పోలీసులు రౌడీషీట్ తెరిచారు. అయితే రెండు రోజుల కిందట విశాఖలోని ఎస్‌కేఎంఎల్ కార్ కంపెనీకి వెళ్లి జగ్గరోతి మోహన్‌రావు వద్ద కారు అద్దెకు తీసుకున్నాడు. శుక్రవారం వరకు కారు అద్దె చెల్లించకపోవడంతో వారు శేఖర్‌ను సంప్రదించగా స్పందించలేదు. కారుకి ఉన్న జీపీఎస్ ట్రాకర్‌ను కూడా తొలగించేశాడు. దీంతో బాధితులు శ్రీకాకుళంలోని టూ టౌన్ పోలీసులను సంప్రదించారు. టూటౌన్ సీఐ జి.ఉమామహేశ్వరావు ఆధ్వర్యంలో పోలీసులు శేఖర్ కోసం గాలిస్తున్నారు. కాగా అద్దెకు తెచ్చిన కారును వేరొకరి వద్ద తాకట్టు పెట్టినట్టు తెలుస్తుంది.

## తీరు మార్చుకుంటే రౌడీషీట్ తొలగిస్తాం


రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ ఉమామహేశ్వరావు

**శ్రీకాకుళం క్రైం:** తీరు మార్చుకున్నవారిపై రౌడీషీట్ తొలగిస్తామని టూటౌన్ సీఐ జి.ఉమామహేశ్వరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్ల సీఐ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎలా అయితే ప్రశాంతంగా ఉన్నారో జీవితంలో కూడా అలానే ఉండాలన్నారు. తగువులు, కొట్లాటలకు వెళ్లోదని, సమాజానికి మీ నుంచి ఎటువంటి హాని కలిగిన ఉపేక్షించేది లేదన్నారు. ఒకరిద్దరు యాక్టీవ్‌లో ఉన్నట్టు గుర్తించామని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ హరికృష్ణ తదితరులు ఉన్నారు.

## ఆరోగ్యానికి వ్యాయామం అవసరం


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో మీనాక్షి

**అరసవల్లి:** సరైన ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామం ఆరోగ్యానికి తప్పనిసరి అని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా శుక్రవారం తమ కార్యాలయ ఆవరణలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం 18 ఏళ్ల నిండిన వారిలో 25 శాతం మంది రక్తపోటుకు గురవుతున్నారని, వ్యాయామం తగ్గడమే అందుకు ప్రధాన కారణమన్నారు. ప్రతీ ఒక్కరూ వారంలో ఐదు రోజులు 30 నుంచి 40 నిమిషాల పాటు వ్యాయామం తప్పక చేయాలన్నారు. అలాగే ఉప్పు, స్వీట్స్, నూనెల వాడకం తగ్గించి ముందస్తు జాగ్రత్తలు పాటించడం అవసరమన్నారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న వారితో బీపీ నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, వైద్యులు ఈశ్వరీదేవి, సుజాత, శ్రీదేవి, పైడి అప్పారావు, జీవీ వెంకటలక్ష్మి, వాన సురేష్, సన్యాసినాయుడు, మురళీ, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు

**బూర్జ:** కురింపేట గ్రామం లో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు సందర్భంగా విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. విశ్వ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు కటకం రాజేశ్వరరావు, శ్రీను, మురళి, అప్పలచారి, రవీంద్ర ఆచారి, శ్రీనివాసరావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


స్వామివారికి సమర్పించిన భోగం

## వేంకటేశ్వరస్వామి విశ్వరూప దర్శనం


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


అలంకరణలో స్వామివారు

**శ్రీకాకుళం కల్చరల్:** శ్రీకాకుళం నగరంలోని పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమల కల్యాణ మహోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి స్వామివారి విశ్వరూప దర్శనం, క్షీరాభిషేకం, ఉత్సవ సంకల్పం, మంట పారాధన తదితర పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ నెల 18న స్వర్ణ కవచ దర్శనం, 19న స్వామివారి కల్యాణోత్సవం, 20న రజకవత దర్శనం, తిరువీధి, 21న మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమార్చన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

## బీఆర్ఏయూలో క్యాంపస్ డ్రైవ్


సూచనలిస్తున్న సంస్థ హెచ్ఆర్ మేనేజర్

**ఎచ్చెర్ల:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో దివీస్ లేబొరేటరీలో ట్రైనీ సూపర్‌వైజర్ ఉద్యోగాల కోసం శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. బీఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్ (కెమికల్), బీ ఫార్మసీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు సుమారు 300 మంది అభ్యర్థులు హాజరయ్యారు. విద్యార్హత సర్టిఫికేట్లను పరిశీలించిన అనంతరం అర్హులైన అభ్యర్థులకు దివీస్ లేబొరేటరీ సంస్థ హెచ్ఆర్ మేనేజర్ రాజేష్‌నాథ్ పూర్ణ ప్రత్యేకంగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలను మూడు వారాల్లోగా విడుదల చేస్తారని వర్సిటీ ప్లేస్‌మెంట్ అధికారి కె.విద్యాసాగర్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖ, కాకినాడ, హైదరాబాద్‌ల్లోని దివీస్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తారని చెప్పారు.

## ఆదిత్యుని సన్నిధిలో ఎమ్మెల్సీ పాకలపాటి


ఎమ్మెల్సీ రఘువర్మను ఆశీర్వదిస్తున్న అర్చకులు

**అరసవల్లి:** ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుడు పాకలపాటి రఘువర్మ, శ్రీకాకుళం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ శుక్రవారం అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని శుక్రవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి వేదమంత్రాలతో ఆశీర్వదించారు.

## ఆదిత్యునికి రూ.లక్ష విరాళం


విరాళాన్ని అందిస్తున్న భక్తులు


**అరసవల్లి:** అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని శుక్రవారం విశాఖకు చెందిన దంతులూరి సూర్యనారాయణ రాజు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి శాశ్వత అన్నదాన పథకానికి లక్ష రూపాయల చెక్కును ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్‌కు అందజేశారు. అర్చకులు వారిని వేదమంత్రాలతో ఆశీర్వదించగా, స్వామివారి జ్ఞాపికను ఆలయ ఈవో వారికి అందజేశారు.

## లలితా సహస్ర పారాయణం


సహస్ర పారాయణంలో పాల్గొన్న మహిళలు

**శ్రీకాకుళం కల్చరల్:** నగరంలోని ఎచ్చెర్ల వీధిలో శుక్రవారం లలిత సహస్ర పారాయణం నిర్వహించారు. షిర్డీ సాయి సేవా సంఘం (మొండేటి వీధి), దివ్య టెక్స్ టైల్స్ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి లలిత మహా త్రిపుర సుందరి పీఠం పర్యవేక్షణలో జగద్గురు ఆది శంకరాచార్య జయంతి సందర్భంగా నిర్వహించారు. సుమారు 1000 మంది మహిళలు పారాయణంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అర్చకులు పెంట రామచంద్రశేఖర్ శర్మ పాల్గొన్నారు.

## కమనీయం.. సాగర తీరం


బారువ తీరంలో కనువిందు చేసిన దృశ్యం

**సోంపేట:** బారువ సాగర తీరంలో శుక్రవారం సాయంత్రం కమనీయ దృశ్యం ఆవిష్కృతమైంది. సాయం సంధ్యవేలలో ఆకాశంలో ఒకవైపు చంద్రుడి వెన్నెల కురిపిస్తున్న సమయంలో.. మరోవైపు సముద్ర ఒడ్డును లైట్‌హౌస్ వెలుగులు మరో చంద్రుడిని తలపించాయి. ఈ అందమైన దృశ్యాలు కడలి కెరటాలపై ప్రతిబింబాలుగా చూసిన పర్యాటకులు ఆనందం వ్యక్తం చేయగా, పలువురు తమ కెమెరాల్లో బంధించారు.

## ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

**అరసవల్లి:** సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను ఆయన అభిమాన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బెహరా మనోవికాస కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బుర్రి మధు, దుంగ శ్రీధర్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కూటమి శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ పాల్గొని కేక్‌ను కట్ చేసి దివ్యాంగులకు తినిపించారు. కార్యక్రమంలో శీర రమణయ్య, పి.గోవింద్, పి.శ్రీనివాసరావు, రెడ్డి గిరిజా శంకర్, ఈశ్వర్, ప్రసాద్, గంగరాజు, మల్లి, పేట పద్మ, అభినయ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## పీఎఫ్ స్లిప్పులు ఆన్‌లైన్‌లో ఉంచాలి

**గుజరాతీపేట:** గత నాలుగు ఆర్థిక సంవత్సరాలను సంబంధించి ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్ నిధి ఖాతాల వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచాలని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న బూస్టర్ స్కీమ్ క్లైములు పరిష్కారానికి తగ చర్య తీసుకోవాలని, పదవీ విరమణ క్లైమ్‌లు త్వరితగతిన పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు ఈ మేరకు శుక్రవారం జడ్పీ సీఈవో ఆర్.వెంకటరామన్‌ను కలిసి సమస్యలు విన్నవించుకు న్నారు. ఇటీవల ఎయిడెడ్ యాజమాన్యం నుంచి మండల పరిషత్, జిల్లా యాజమాన్యంలోకి మారిన ఉపాధ్యాయుల భవిష్య నిధి ఖాతా నెంబరు మంజూరుకు చొరవ చూపా లని కోరారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లండ బా బూరావు, బమ్మిడి శ్రీరామ్మూర్తి, జిల్లా కోశాధికారి రవి కుమార్, జిల్లా కార్యదర్శి అన్నాజీరావు, పి.అప్పారావు, ఎల్.కోదండ రామయ్య, రెడ్డి త్రినాథరావు తదితరులు ఉన్నారు.

## నిజాయితీ చాటుకున్న రైతు

**పొందూరు:** ఓ రైతు తనకు దొరికిన బంగారు ఆభరణాలు, కొంత మొత్తాన్ని తిరిగి బాధితుడికి అప్పగించిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పిల్లలవలస గ్రామానికి చెందిన పైడి సూర్యనారాయణ పొందూరులోని ఓ బ్యాంకులో కుదవపెట్టిన బంగారు ఆభరణాలు గురువారం విడిపించాడు. ఈ క్రమంలో ఇంటికి వస్తూ గ్రామ సమీపంలోని చెరువు గట్టు వద్ద ఆభరణాలతోపాటు రూ.4 వేలుతో కట్టిన మూట పెట్టి స్నానానికి దిగాడు. ఈ క్రమంలో ఓ కుక్క ఆ మూటను పట్టుకుని వెళ్లిపోయింది. ఇది గమనించిన సూర్యనారాయణతో పాటు గ్రామస్థులు పరసరాల్లో వెతికినా ఫలితం లేకపోయింది. అయితే అదే గ్రామానికే చెందిన గురుగుబెల్లి త్రినాథరావు పొలంలో పనిచేస్తుండగా ఆ మూట అతడికి దొరికింది. సూర్యనారాయణ బంగారు ఆభరణాలు, డబ్బులు ఉన్న మూట పోగట్టుకున్న విషయం తెలుసుకున్న త్రినాథరావు.. ఆ మూటను తీసుకెళ్లి సూర్యనారాయణకు అప్పగించాడు. సుమారు రూ.2లక్షలు విలువున్న సొత్తును బాధితుడికి అప్పగించి త్రినాథరావును గ్రామస్థులు అభినందించారు.

## సంగీత కళాకారునికి జాతీయ పురస్కారం


ధనుంజయ

**ఇచ్ఛాపురం:** టీ.బరంపురం గ్రామానికి చెందిన సంగీత కళాకారుడు తిప్పన ధనుంజయరెడ్డి జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారని తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మశ్రీ డాక్టర్ అప్పనపల్లి భాస్కరాచార్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ధనుంజయ గత 25 ఏళ్లుగా శాస్త్రీయ సంగీత, పండరి భజన, కోలాటం, జానపదాలు కళా రంగంలో రాణించడం గుర్తించి జాతీయ పురస్కారానికి ఎంపిక చేశామని తెలిపారు. పురస్కారాన్ని ఈనెల 19న ఒగోలులో జరిగే కార్యక్రమంలో అందుకోనున్నట్టు తెలిపారు. ధనుంజయ పురస్కారానికి ఎంపికైన ధనుంజయకు స్థానిక కళాకారులు అభినందించారు.

## భగవద్రామానుజులపై ప్రవచనం

**శ్రీకాకుళం:** నగరంలోని పాలకొండ రోడ్‌లో ఉషనిష్మందిరంలో ఆది శంకరాచార్యుని జయంతి పురస్కరించుకుని శుక్రవారం శ్రీకూర్మం అర్చకులు భాష్యం పద్మనాభచార్యులు భగవద్రా రామానుజులు భక్తి తత్త్వంపై ప్రవచనం చేశారు. ఉపాధ్యక్షులు పి.పతంజలి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## రెండు గ్రామాల్లో పోలీసు పికెట్

**గార:** ఎన్నికల అనంతరం ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఉండేందుకు తాన్ సాహెబ్‌పేట, కొయ్యానపేట గ్రామాల్లో అధికారుల ఆదేశాల మేకు పోలీసు పికెట్ ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. చట్టాన్ని అతిక్రమించేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


రాళ్లు తేలిన అనంతగిరిపేట రహదారి


మట్టి రోడ్డుకే పరిమితమైన కొత్తవలస రహదారి

# అధ్వానంగా రహదారులు

- ఆదివాసీల రోడ్లపై చిన్నచూపు
- పట్టించుకోని పాలకులు
- అవస్థలు పడుతున్న గిరిజనులు

**బూర్జ:** ఏళ్ల గడుస్తున్నా.. ఐదేళ్లకొకసారి నాయకులు మారుతున్నా.. ఆదివాసీల సమస్యలు పరిష్కారం కావడం లేదు. ముఖ్యంగా సరైన రహదారుల లేకపోవడంతో నిత్యమూ వారి రాకపోకల విషయంలో ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికలు వస్తే మాత్రం వారి భుజాలపై చేతులు వేసి హామీలు గుప్పించడమే తప్పా ఫలితం ఉండడం లేదని ఆదివాసీలు వాపోతున్నారు. డొంకలపర్త పంచాయతీ పరిధిలో హరిపురం, పల్లాపురం, పెద్దపేట, పెద్దపేట పంచాయతీ కొండపేట, పాలవలస పంచాయతీ కొత్తవలస, అప్పలపేట పంచాయతీలో బూర్జగూడ, అనంతగిరి, పీఎల్ దేవిపేట పంచాయతీ పరిధిలో సోమిదాలవలస, జంగాలపాడు, మసాన్‌పుట్టి ఆదివాసీ గ్రామాల రహదారులు శిథిలావస్థకు చేరాయి. అత్యవసర సేవలకు, రేషన్ డిపోల నుంచి బియ్యం, పాఠశాలలకు విద్యార్థులు వెళ్లాలన్నా నరకయాతన పడుతున్నారు. రాళ్లు తేలి ఉన్న రహదారులపై ప్రయాణం మరింత ఇబ్బంది పడుతున్నారు. పట్టణ ప్రాంతాలకు వెళ్లాలంటే రాళ్లు తేలిన రహదారులపై నడవలేకపోతున్నామని గిరిజనులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

## ప్రమాదకర మలుపులు

- కానరాని వేగ నిరోధకాలు, హెచ్చరిక బోర్డులు
- ఇబ్బంది పడుతున్న వాహనచోదకులు

**గార:** మండలంలో చాలా గ్రామాలకు వెళ్లే రహదారుల్లో దగ్గర మలుపులు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా వమరవెల్లి రోడ్ వద్ద కల్వర్టు ఆనుకొని దగ్గర మలుపులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా ఇక్కడ ఎటువంటి వేగ నిరోధకాలు కానీ, హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయకపోవడం శోచనీయం. అలాగే కొమరవానిపేట వెళ్లే రోడ్డులో బూరవెల్లి వద్ద కల్వర్టు ఆనుకొని ఉన్న మలుపులో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. అంపోలు, దీపావళి, శ్రీకూర్మం, వాడాడ ఉప్పరిపేట వద్ద కాలువ పై దగ్గర మలుపుతో పాటు మొదలైన గ్రామాలకు వెళ్లే రోడ్డు దగ్గర మలుపులు ఉన్నప్పటికి ఎటువంటి వేగ నిరోధకాలు హెచ్చరిక బోర్డులు కూడా లేకపోవడంపై సర్వాత్ర మండిపడుతున్నారు. నిత్యం వాహనాలు రాకపోకలుతో రద్దీగా ఉండే ఈ రోడ్డు మలుపులు వద్ద ప్రమాదాలు నివారణకు వేగ నిరోధకాలు, హెచ్చరికల బోర్డులు ఏర్పాటుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


వమరవెల్లి జంక్షన్ సమీపంలో ప్రమాదకర మలుపు